

# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



90

## పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము

**20. ఇతి గుహ్యతమం శాస్త్ర మిదముక్తం మయాఽనఘ**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్కృతకృత్యశ్చ భారత.**

**వ్యాఖ్య:-** ఇంతదనుక చెప్పబడిన ఈ గీతాశాస్త్రమునంతను చక్కగా తెలిసికొనిన వారికి కలుగు ఫలితమును ఇచట వచించుచున్నారు. తాను గావించిన ఈ బోధయంతయు అతిరహస్యమైనదని (గుహ్యతమమ్') మొట్టమొదట భగవానుడు పలికెను. కనుకనే 'గుహ్యమ్' అనిగాని, (గుహ్యతరమ్' అనిగాని చెప్పక 'గుహ్యతమమ్' - అని 'తమ' ప్రత్యయపదమును ప్రయోగించి బోధయొక్క అతి గోప్యత్వమును,పరమరహస్యత్వమును వెల్లడించిరి. సామాన్యముగ అతి రహస్యమైన విషయమును మహనీయులు అందఱికిని జెప్పరు. యోగత్య గలిగినవానికే, 'అధికారి'కే చెప్పుదురు. 'మఱి అర్జునుడు అట్టి యోగ్యతను బడసెనా? అతనికి చిత్తశుద్ధికలదా?' అని జనులు ప్రశ్నించుదురేమో యని తలంచి కాబోలు భగవానుడు వెనువెంటనే 'అనఘ' (పాపరహితుడా) అని అర్జునుని సంబోధించి ఆ సంశయమును తీర్చివైచిరి. అర్జునుడు, పాపరహితుడు, నిర్మలచిత్తుడు, ఆధ్యాత్మిక విజ్ఞానశ్రవణమునకు, గ్రహణమునకు అధికారి. అర్జునునివలెనే ఎవరైనను సరియే తమచిత్తమందలి దోషములను, పాపములను కడిగివైచికొనినచో వారికి సర్వేశ్వరుడు ఏ మహనీయుడగు గురువుద్వారానో, లేక ఏదియోయొక నిమిత్తము చేతనో బ్రహ్మ తత్త్వము నుపదేశింపజేయును. లేక స్వయముగనే అట్టి ఆధ్యాత్మిక జ్ఞానగ్రహణానుకూలమగు ధీశక్తిని వారికి కలుగజేయును (దదామి బుద్ధియోగం తమ్).

భగవదుక్తమగు ఈ బోధ నెఱుగుట వలన కలుగు ఫలితమేమి? దాని నెఱుగుట వలన మనుజుడు (1) జ్ఞానవంతుడు ('స్వస్వరూపానుభవము కలవాడు) (2) కృతకృత్యుడు కాగలడు. ఇట్టి బోధ తెలిసికొనుటవలన మనుజుడు భగవంతునిపై అనన్యభక్తిగలవాడై తద్వారా బుద్ధియోగమును అనగా జ్ఞానానుభవమును (స్వస్వరూపానుభవమును) బడయగల్గును. దానిచే నతడు కృతకృత్యుడు కాగలడు. అట్టి కృతకృత్యముచే కృతార్థుడున్ను తప్పక కాగలడు. ప్రపంచములో ఏ యితరకార్యముచే గూడ మనుజుడు కృతకృత్యుడు కాజాలడు. ఒక్క బ్రహ్మవిద్యచేతనే, అధ్యాత్మజ్ఞానముచేతనే అతడు కృతకృత్యుడు కాగలడు- అని భగవానుడిచట 'ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్కృతకృత్యశ్చ' - అను వాక్యము ద్వారా స్పష్టముగ చెప్పివైచిరి. కావున ధన్యులు, కృతకృత్యులు కాదలంచినవారు, జన్మసార్థకత నొందదలంచినవారు భగవానుని ఈ వాక్యముపై విశ్వాసముంచి గీతయందు తెలుపబడిన పరమార్థ రహస్యములనెల్ల చక్కగా నభ్యసింపవలయును. అట్లు కృతకృత్యులు కాకుండ మరణించినచో గొప్ప ప్రమాదము గలదు. జన్మపరంపర విడనాడదు. దుఃఖజాలము వెన్నంటుచునే యుండును.

**ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జునసంవాదమునగు శ్రీ భగవద్గీతలందు పురుషోత్తమ ప్రాప్తియోగమను పదునైదవ అధ్యాయము సమాప్తము.**

## దైవాసుర సంపద్విభాగయోగము

**శ్రీ భగవానువాచ:-**

**1. అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగవ్యవస్థితిః**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్**
**2. అహింసా సత్యమక్రోధ స్త్యాగశ్శాన్తిరపైశునమ్**
**దయా భూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్.**
**3. తేజః క్షమా ధృతిశ్శౌచ మద్రోహో నాతిమానితా**
**భవన్తి సమ్పదం దైవీ మభిజాతస్య భారత.**

**వ్యాఖ్య:-** గీతా గ్రంథమున 'సాధన'కు విశేషప్రాముఖ్యత నొసంగబడినది. చిత్తము నిర్మలముగానున్నచో, అత్తఱి పారమార్థికలక్ష్యము చేరువనేయుండును. కావున అట్టి చిత్తశుద్ధిపరికరము లనేకములు గీతయందొసంగబడినవి. ఈ అధ్యాయ ప్రారంభమునగల దైవీసంపద్వివరణము వానిలో చేరినదే అయియున్నది. ఇఱువదియాఱు సుగుణములను భగవాను డిచట తెలియజేసిరి. వానినన్నింటిని ముముక్షువు- విద్యార్థి పాఠములను వలె - క్షుణ్ణముగ నభ్యసించి హృదయమును పరిశుద్ధ మొనర్చుకొనినచో ఇక మోక్ష లక్ష్యము సన్నిహితమైనట్లే యగును. కావున సాధకు లీసద్గుణరాశిని ప్రయత్నపూర్వకముగ నవలంభించి కడుజాగరూకతతో వానిని కాపాడుకొనుచుండవలెను.

సందప యనగా ధనము, ఐశ్వర్యము, దైవసందపయనగా దైవధనము. శ్రీకృష్ణపరమాత్మ దైవధనము నిపుడు లోకులముందు వెదజల్లుచు 'ఓ జీవులారా! నశ్వర ప్రాపంచిక ధనములతో క్రీడించుచు, వానియందే అమూల్యకాలమంతయు వినియోగించుచు దుఃఖపరంపరలను, జన్మపరంపరలను బొందకుడు! ఇవిగో తీసికొనుడు. దైవసంపద్రాసులను, పారమార్తిక రత్నచయములను' అని వచించుచున్నారు. ఈ దైవధనము ముందు ప్రాపంచిక సంపదలు, వజ్రవైఢూర్యాదులు ఏపాటి విలువగలవి? కావున వివేకవంతు లీ దైవసంపదను శీఘ్రముగా హస్తగతమొనర్చుకొని జ్ఞానధనులై బ్రహ్మసాయుజ్యము నొందెదరు గాక!

'అభయమ్'- శ్రీకృష్ణపరమాత్మ, అర్జునునకు అనేక సుగుణములను చెప్పదలంచినవారై మొట్టమొదట 'సుగుణరాట్' అనదగు, 'సుగుణసింహ' మనదుగు 'అభయము'ను పేర్కొనెను. ఇది గమనింపదగిన విషయమై యున్నది. ఏలయనిన, ఎన్నియో ఇతర సుగుణములుండ ఈ 'భయరాహిత్యము'నే తొలుదొల్త చెప్పనేల? దీనికి కారణములు కలవు- (1) అన్ని దుర్గుణములకు భయమే పునాది; భయమునుండియే తక్కిన అవగుణములన్నియు నంకురించును. కావున విజ్ఞులద్దానిని మొట్టమొదట పారద్రోలినచో, అనగా నిర్భయత్వము నవలంభించినచో ఇక తక్కిన సుగుణములన్నియు అవలీలగా వచ్చి చేరగలవు. ఇక్కారణమున నయ్యది మొదట చేర్చబడి యుండవచ్చును. మఱియు (2) త్రాడులాగు పందెము (Tug of war) లో మొదటివానిని, చివఱివానిని మహాబలశాలులుగా నుండునట్లు చూచి పెట్టుదురు. అట్లే అసురగుణములు గావింపబడుచున్న పందెమున దైవగుణములపక్షమున 'అభయం'- అను సుగుణరాజమును ఏరి భగవాను డద్దానిని నాయకుని (Captain) గ జేసి రణరంగమున నిలబెట్టెను. దీనిని బట్టి అది యెంతటి మహత్తర సుగుణమో వ్యక్తము కాగలదు. (3) 'అభయంవై జనక ప్రాప్తో2సి' - అని ఉపనిషత్తులా యభయమును సాక్షాత్ బ్రహ్మపదముగనే వర్ణించి చెప్పినవి. కాబట్టి గీతయందు భగవానునిచే నెంతయో ప్రముఖముగ నెంచబడినట్టి ఈ నిర్భయత్వమను గుణరత్నమును సర్వులును లెస్సగ నభ్యసించి దైవసంపత్తిని బాగుగ కూడబెట్టుకొనవలెను.

*(తరువాయి వచ్చే సంచికలో)*

# సరస్వతీదేవి తెలుగు సార్వస్వతాని కొసగిన 'మహాభాగవతం' అద్భుతగ్రంథం!



పోతనకు ముందుగానీ, పోతన అనన్తరం, యిప్పటివరకుగాని 'మహాభాగవతం వంటి గ్రంథాన్ని రచించినవారు లేరు. అంత చక్కటి సరళ వ్యాఖ్యానంతో, సుధామాధుర్య వెలకించు పదసముచ్ఛయం పదలహరీరంజితముగా పద్యముల్జెప్పినవారు లేరు. చిన్నపిల్లల్నుంచీ, ముక్కాటి ముదుసలుల వరకూ భాగవతంలోని పద్యాలు కంఠతా వచ్చినవారే!

నవరసాల బాలరస కోయిల కూత కూడా అంతటి రసరంజితముగా కూయలేదు. 'ఆంధ్రమహాభాగవతం' వ్యాసుల కీర్తిని దిగ్దంతములకు వ్యాపింపచేసింది.

వ్యాస, శుకుల విద్వద్విభవాన్ని రసింపచేసిన వాడు బమ్మెరపోతనామాత్యుడు. బమ్మెర పోతనామాత్యుడు భాగవతాన్ని ఆంధ్రీకరించని నాడు- ఆ కావ్యసొగసు ఆంధ్రవాఙ్మయమును శోభింప చేసేది కాదు. భక్తి భావన సంభావితమయ్యేదికాదు. అందుకే పోతన గారు రామాయణం రచించిన వాల్మీకి, దానినాంధ్రీ కరించినవారికీ, మహాభారతమును రచించిన వ్యాసునికీ, ఆంధ్రానువాదకర్తలైన నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగడలకు, తన భాగ్యమునెఋక చేస్తూ, తనకు పూర్ణ సౌభాగ్యమున ఆంధ్రీకరించే పనిని చేయలేదు. కావున ఆ అవకాశం తనకు లభించినదని కృతజ్ఞతలు చెప్పాడు.



తెలుగు భాష మాట్లాడినా, మాట్లాడకపోయినా, పోతన పద్యమెరుగని వారుండరు. మహాభాగవత పూర్ణసారాన్ని పూర్ణేందుముఖునిగా తెలుగువారి కెరుకచేసి, తెలుగు సరస్వతీ ఋణం తీర్చుకున్న ధీశాలి 'పోతన' అని అంటారు గానీ, పోతన భాగవతంలోని ఓ పదిపద్యాలనైనా చదివింపచేసి, పలికింపచేసే తల్లితండ్రులు పదిమందైనా లేకపోవడం విచారం కలుగచేస్తూంది. నా చిన్నతనంలో అక్షఱం రాని తెలుగువారు కూడా 'భాగవతం' లోని పద్యాలను అక్షరం పొల్లుబోకుండా చెప్పేవారు.

ఆనాడు శ్రీనాథుడు తెలుగునాడు అధిగమించి కన్నడ రాజ్యలక్ష్మిలో తన సరస్వతీ పటిమను ఉల్లమునుల్లసిల్లేట్టు ఉల్లేఖించా డంటారు. ఈనాడు పోతనగారి 'భాగవతాన్ని' కన్నడ భాషలోకి అనువదించి ఆవిష్కరించిన ఘనతను కైవారకు చెందిన యోగి నారాయణ మఠంవారు, బెంగుళూరుకు చెందిన యోగినారాయణ అధ్యయన కేంద్రంవారూ చేబట్టి- 8 సంపుటముల గద్యానువాదాన్ని- ఎం.ఎస్. రామయ్య సంస్థల విద్యాలయంలో ఆవిష్కరింపచేయడమే గాకుండా రు 4,500లు విలువగల 8 సంపుటాలను రు. 2,500లకే విక్రయింప నిర్ణయించినట్లు, ఆవిష్కరణం రోజున 1,500/- లకే విక్రయించినట్లు తెలియజేసారు. ఆవిష్కరణ మహోత్సవంలో తిరుమల తిరుపతి దేవస్థానముల పూర్వపు పాలనా కార్యనిర్వాహణాధికారి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఆరోగ్యశాఖ ముఖ్యాధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఐఎఎస్, ఎం.జి.గోపాల్ ఐ.ఎ.ఎస్, ప్రఖ్యాత ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రభృతులను పాల్గొనడం కార్యకర్తల తెలుగు అభిమానానికి ప్రతీక. కన్నడ సాహిత్యవేత్త కె.ఎస్.నారాయణా చార్య పాల్గొన్నట్లు గోకుల ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షులూ ముఖ్య కార్యకర్తయైన ఎం.ఆర్.జయరాం వివరించారు. తెలుగు పురాణ సాహిత్య గ్రంథమైన మహాభాగవత గ్రంథమును కన్నడిగుల కందచేయడంలో వారి అంతర్హృదయం అభినందించ తగ్గది. పురాణ యితివృత్తమునందచేయడం పోతన కూర్చిన 'మహా భాగవతం' గ్రంథాన్ని అనువదించడం తెలుగు గ్రంథకర్తపై వారు చూపిన అమేయమైన అభిమానం, ఆదరం, వాత్సల్యం. ఆనాటి కన్నడాంధ్రభాషా సమన్వయం ఆశించే వారికి పోతనకు అందించిన నివాళిగా తలుస్తున్నాం. అక్షఱ రూపంలో అమిత ప్రతిరూపంగల భాషలు కన్నడాంధ్రములకు పందిరి వేసినట్లయినది. ●

మన్మథ ఉగాది నామ శుభ
సందర్భముగా మా పాఠకులందరికీ
శుభాకాంక్షలందచేస్తున్నాం.
- ప్రముఖాంధ్ర యాజమాన్యం

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
AMBICA DURBAR BATHI
అంబికా దర్బార్‌బత్తి


*Compliments from*
**Sri Krishna Bhat**
*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464




అశోకా-T శాండల్‌ఉడ్ - టాల్కం పౌడర్సు మరియు అశోకా-T ఆమ్లా బ్రిలియంటైన్

# మొక్కజొన్న తోటలో- ములిసిన చీకట్లలో మంచెకాడ కలుసుకో- మావయ్య మరువకు మరువకు మామయ్య- అనిపించిన - కొనకళ్ళ వెంకటరత్నం

## - మనల్ని వీడి ముప్ఫైనాలుగేళ్ళయింది!!-



జనపదాలను జానపదగీతాలే కాదు; జాన తెలుగులో పాటలు వ్రాసిన తెలుగు కవులున్నారు. ఎంకి పాటలు తరువాత- ముందూ ఎంతోమంది తెలుగు కవులు జనుల చెవులూరించే పాటలు వ్రాసారు. ఆ కవులు గతించినా ఆ పాటలు జనులను చెవులూరింపచేస్తునే ఉన్నాయ్. వారినాపాటలు చిరంజీవుల్ని చేస్తున్నాయ్.

మొరటు శృంగారం కన్నా, దోర శృంగారమే మనుష్యుల్ని మురిపింపచేస్తున్నది. లలిత సంగీత పాటల కన్నా లలితమైన పాటకు సాహిత్యం మన తెలుగులోనే ఉన్నది. స్వాంతనంలో సంతోషం కూరే పాటలు అక్షఱ జ్ఞానం లేనివారిని కూడా ఆనందింపచేస్తాయ్, ఆలపింపచేస్తాయ్.

నృత్యకారులెల్లరి నోటా పాడే పాటలు, నాటుకున్న పాటలున్నాయ్, వీటికాపాటల పద సంపుటిలోనే స్వరం ఉంది, లయ ఉంది, హొయ ఉంది, తాళం ఉంది.

**మొక్కజొన్నతోటలో మురిసిన చీకట్లలో మంచెకాడ కలుసుకో మామయ్యా! మరువకు మరువకు మామయ్యా-**

ఎన్ని లలిత సంగీత కచ్చేరీల్లో ఈ పాటను విన్నాం. ఎన్ని నృత్యాల్లోనో చూసాం. ఎన్ని సినిమాల్లోనో చూసాం. చూచి, చూచిన నృత్యమైనా, ఎన్నోసార్లు పాటను విన్నా - విసుగనిపించదు. అయితే యీ పాటను ఎవరెవరో వ్రాసారంటారు. వాదాలూ చేసారు; వివాదాలకు దిగారు.

కొనకళ్ళ వెంకటరత్నంగారు వ్రాసారని కొంతమంది చెప్పిన తరువాత- నా ఆనందం పరుగులెత్తింది. అంతర్వేది దగ్గర సాగరంలో కలిసిన వశిష్ట గోదావరిలా ఆనందం శాంత రూపిణియై ప్రశాంత రూపిణియై, జ్వలరూపిణియై, ప్రజ్వలరూపిణి యైనట్లు అనేక అనుభూతుల్ని కలిగించింది. అందుకు కారణం కూడా లేక పోలేదు. కొనకళ్ళ వేంకటరత్నంగారు మా పశ్చిమ గోదావరి జిల్లా వారు - పెంటపాడులో 1909 సం॥ములో పుట్టి, కాకినాడలో చదువుకుని పోలీసుశాఖలో చేరి - ఆయన తిరిగి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన ఏలూరుకే బదిలీ చేయించుకున్నాడట.

ఎంత ఆనందం। ఎంత ఆనందం! గోదావరి జిల్లాలో పుట్టిన వ్యక్తి- గోదావరి జిల్లాలోనే ఉద్యోగం చేసి, గోదావరి జిల్లాలో కల ఏలూరులోనే స్థిరంగా ఉండిపోయా రంటే ఆయనలో ఉన్నదంతా గోదావరి భాషా, గోదావరి జిల్లాల్లోని గ్రామ్యాలన్నీ ఆయనకు ఒంటబట్టి ఉంటాయనేగా। ఎంకిపాటలు వ్రాసిన నండూరి సుబ్బారావుగారూ ఏలూరివారే!

'రావోయి బంగారు మాఁవాఁ' కూడా కొనకళ్ళ కలం నుంచీ జాలువారిన పాట. ఆ పాటను కూడా ఎన్నో చిత్రాల్లో ఎన్నో విధాలుగా ఉపయోగించారు. ఎంతటి కమ్మని పాటలు వ్రాసారు కొనకళ్ళవారు. ఆయనింకా పొద్దుతిరుగుడు పూలు గేయ సంపుటి కూడా వ్రాసారని ఎక్కడో చదివాను. ఓ ఇరవై కథలకు పైగా వ్రాసారని విన్నాను. కొన్ని చమత్కారమైనవీ, కొన్ని చెళుకులవిరుపులు కలవి!

'సుక్కలన్ని కొండమీద సోకు జేసుకొనే వేళ'- అని చరణాన్ని పాడుతూంటే- దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం, శ్రీరంగం నారాయణ బాబుగారలు ఖుషీఖుషీగా దువ్వే పదాలనూ, ఆ పదాల్ను దువ్వే స్వరాలను విని ఆనందంలో మునిగి ములకలు వేసారుట. నండూరి సుబ్బారావుగారి ఎంకిపాటలు వసంత గాలి వీచినట్లు వీచి ఏలూరును పుల కింపచేసింది. కొనకళ్ళ వారి పాటలు కోయిల గానం చేసింది. వెంకటరత్నంగారి కుమారుడు అక్కడే స్థిరపడ్డాడనీ, ఆయన కుమార్తె నాగచంద్రావతి కథారచయిత్రియని తెలుస్తూంది. ఇంతటి సామర్థ్యం ఉన్న కొనకళ్ళ వేంకటరత్నంగారి పాటల ప్రాచుర్యం, వెంకటరత్నంగారి పేరుకు రావల్సినంతగా పేరు తీసుకుని రాలేదు. ఆయనే ప్రచారాల కెగబడినవాడు కారేమోననిపిస్తున్నది.

సుప్రసిద్ధ కవి నండూరి రామకృష్ణాచార్యులుగారు కొనకళ్ళకు దక్కవలసిన పేరు ప్రఖ్యాతులు దక్కలేదన్నారు. సుప్రసిద్ధ రచయిత తిలక్ అక్షఱలోకంలో మీరు వారగా ఉండి పూలు పూయిస్తున్నపుడు- ఆ ప్రక్కనుంచే వెడుతూ ఆ సాహితీ మధురిమలను ఆఘ్రానించినవాణ్ణిని అన్నారు.

1971 సం॥ము జనవరి 9న ఈ లోకం పని ఏ ముందనుకున్నారో, ఏమో ఆ లోకం వారు ఆయన పాటలను విని ఆనందించడానికి ఆహ్వానించుంటారేమోనని ఓ అభిమాని అన్నారు.

అభిమానించేవారు ఆయన్ను అతి దగ్గరగా తీసుకున్నారు. ఈ మనసైన బంగారు మామనొకసారి స్మరించుకుందాం. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Beautiful City - Beautiful Hotel


Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# చెన్నయ్‌ని తిరువారూరుగా చేస్తున్న డా॥ నల్లి కుప్పుస్వామి చెట్టి


పట్టు వస్త్ర వ్యాపారి
డా॥ నల్లి

చెన్నయ్ మహానగరం త్యాగరాజుల వారి కీర్తనల రాజధానిగా వెలుగులీనుతుందంటే – డా॥ నల్లి కుప్పుస్వామి చెట్టి గారు బెంగుళూరు నాగరత్నమ్మ వంటి అంకిత భావకుడు.

ఆకాశంలోని తారకలను లెఖ్ఖపెట్టవచ్చు. కానీ ఆయన పెంచి ప్రోత్సహిస్తున్న సంగీత సభలెన్నో, సంగీత విద్వాంసులెందరో లెఖ్ఖగట్టి చెప్పడం కష్టం.

డా॥ కుప్పుస్వామి చెట్టి రాజ్యమేలిన ప్రభువు కాదు; పట్టు వస్త్ర ప్రభువు – పట్టువస్త్రం వలెనే ఆయన మనసు మెత్తనిది. 'లేదు' అనే రెండు అక్షఱాలు చెప్పలేని రాయని భాస్కరుడు.


నవంబర్, డిసెంబర్‌లోని 60 రోజులూ సంగీత సభలు జరుగుతూన్నాయంటే – ప్రధాన కారకుడు కుప్పుస్వామి చెట్టే. ఆయన సంగీతాధ్యయనం చేయలేదు. కానీ సంగీతంలోని రాగాల పేర్లన్నీ చెప్పగలడు. పాడే పాట ఏ రాగమో చెప్పకలిగే ప్రజ్ఞా సంపన్నుడు.

సంగీతంపై గల అభిమానం సాహి త్యంపైనా ఉన్నది. తమిళం నేర్చుకోవడం వలన, యెక్కువగా తమిళంలోనే గ్రంథ రచనం చేశాడు. భాషా సాహితీవేత్తలను ప్రోత్సహించాడు.


విద్యాప్రదాతగా అనేక విద్యాలయములకు భూరివిరాళము లివ్వడం, తరగతి గదులను నిర్మించడం వంటి యెన్నో కార్యక్రమములను పిఠాపురం రాజావారిలా చేస్తూన్న వ్యక్తి.

ఇటీవల డా॥ నల్లి కుప్పుస్వామి చెట్టిని ఎచ్చీవ్‌మెంటు అవార్డుతో సత్కరించినట్లుగా విని, ప్రముఖాంధ్ర మనసారా అభినందిస్తూన్నది.

ప్రొఫెసర్ సి.యం.కె. రెడ్డి చేసే తెలుగు కార్యక్రమాలకు, అనేకానేక తెలుగు సంస్థల కార్యక్రమాలకూ డా॥ కుప్పుస్వామి చెట్టి చేయూతనిస్తూండడం బహుదా ప్రశంస నీయమనే చెప్పాలి. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రప్రథమంగా జరిపిన తెలుగు మహాసభ భోజన వసతికి కుప్పుస్వామి చెట్టిగారే ప్రధాన విరాళ కర్త. ఆయనకు కీ॥శే॥ ఎల్వీ రామయ్య మంచి మిత్రుడు. ఆయన సలహాతోనే తిరుమల తిరుపతి నిత్యాన్న దాన పథకానికి – తొలి దశ బృహద్విరాళ కర్తగా, ఆయనంద చేసిన సేవలు ఈనాటి కొందరికి తెలియవు.


సంగీత సాహిత్యాలపై పట్టు కల్గిన
డా॥ నల్లి

తిరుపతిలో త్యాగరాజ సమితి చేస్తున్న త్యాగరాజ దశ దినోత్సవ సంగీత సభలకు కూడా ఆయన సహకరిస్తూంటాడు. ఉదయం లేచి – నిత్య పూజలు చేసుకుని, 9 గంటలకు ప్రారంభమయ్యే దినచర్య అవిరామంగా రాత్రి 11 గంటలకు కొనసాగినా – అలసటెరుగని వ్యక్తి, వ్యాపార నిర్వహణతో బాటు, అపార జనహితైషిక కార్యక్రమాలు చేస్తున్న కవిగాయక హృదయ మందారుడు. ●



వాణీ జయరామ్‌ను
సత్కరిస్తూ



# ఆ నవ్వులో జాబిల్లి ఉంది!
# ఆ నవ్వులో అమాయకత్వం ఉంది!
# ఆ మోమున చిరునవ్వు చెరగదు!



రాకా సుధాకరుని నవ్వు పున్నమినాడే పూర్ణంగా ఉంటుంది; కానీ శుభలేఖ సుధాకరుని నవ్వు నిరతము చూచినా పున్నమి జాబిలినవ్వులానే ఉంటుంది. 'శుభలేఖ' చిత్రంతో తెలుగు చలన చిత్రరంగంలో కాలూనినందువల్లనేమో- ఆ పేరునే కొనసాగిస్తున్నాడు. కొందరికేమో తొలి చిత్రం పేరులే ఇంటిపేరులౌతుంటాయ్.

నటనపై అభిరుచి కొద్దీ, మద్రాసు ఫిలిమ్ ఇనిస్టూట్యూట్‌లో నటునిగా సుశిక్షణ పొందాడు. సమర్థులైన దర్శకుల చిత్రాల్లో నటించాడు. ఏ చిత్రంలో చూచినా చలాకీగానే నటించాడు, పాత్రౌచితిని పాటించాడు. అణకువ కలవాడు. 1982 సం॥ములో మద్రాసు వచ్చినప్పట్నుంచీ ఇక్కడే ఉంటున్నాడు. నటన తక్క వేరే ధ్యాస లేదు.

విశ్వేశ్వరరావుగారి చిత్రం పెళ్ళిపిలుపో ముహూర్తమో జ్ఞాపకం లేదు, 'ముద్దమందారం' నాయకి పూర్ణిమతో నాయక పాత్రను ధరించాడు. ఆ చిత్రాన్ని ఎన్నో మారులు చూసాను. అంత పెద్ద పెద్ద చిత్రాలు నిర్మించిన విశ్వేశ్వరరావుకు ఆ చిత్రం విడుదల కాలేదు. సుధాకర్ నటనకు ముచ్చటపడి, ఆ చిత్రం ప్రివ్యూ వేసినపుడల్లా చూచేవాణ్ణి.

నాగార్జున నటించిన 'శివ' చిత్రంలో నాగార్జున స్నేహితునిగా ఎంతో చలాకీగా నటించాడు.

'షావుకారు' చిత్రంలోని ఎన్టీరామారావులా విశ్వేశ్వరరావు చిత్రంలో నటించాడు. సుధాకర్ శిరోజాలు ఎంతో బాగుంటాయ్. ఆలా ఎవరికీ లేవు. ఎల్వీ ప్రసాదు 'సత్యమే జయం' చిత్రంలో ఎందరొస్తె మనకేంవె బుల్‌బుల్- అందర్ని తందామె బుల్‌బుల్ అంటూ కేశాల్ను త్రిప్పినట్లు 'రఫ్' పాత్రలు వేసుంటే- అలాటి మంచి మంచి కథా చిత్రాలు దొరికి ఉంటే, బాగా రాణించేవాడేమో!

చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్ తరలి వెళ్ళింది, సుధాకర్ హైదరాబాద్ వెడితే బాగుండేదేమో- యని కొందరంటూంటారు.

నేనీ విషయాన్ని విశ్వసించను. ఎందరో యిక్కడున్న నటీనటుల్ని ఫ్లైట్ టిక్కెట్లిచ్చి తీసుకుని వెళ్ళలేదూ! ఇక్కణ్ణుంచి తీసుకుని వెళ్ళే నటులు కన్నా తీసి పోయాడా? తెలుగు రాని అన్యభాషా నటుల్ని కూడా తీసుకుని వెడ్తున్నారే! చక్కని వాచ్యముండీ, ఏ పాత్రలోనైనా అవలీలగా ఒదిగిపోగల ఆకృతీ ఉండీ, నటించే శక్తిగల సుధాకర్‌ని తీసుకుని వెళ్ళలేరా!

తమిళంలోని బుల్లితెర (టి.వి) సీరియల్స్‌లో సుధాకర్ నటనను చూచి అబ్బురపడ్డాను. ప్రేమ, హాస్యం, లాస్యం, అతిశయం, హుందాతనం, క్రౌర్యం కల పాత్రల్ను వయసుకు మించిన పాత్రల్ను ధరించాడు. తల నెరసిన కథానాయకిలుతో సమ ఉజ్జీగా నటించాడు. సటిస్తూనే ఉన్నాడు. సుధాకర్ నటన చూస్తున్నప్పుడు ఆల్‌రౌండ్ ఆర్టిస్టుయని అనక తప్పడంలేదు. ఇంత నటనా చాతుర్యం గల నటుణ్ణి తెలుగు బుల్లితెర వాళ్ళొక్కరూ అవకాశమిస్తున్నట్లు తోచదు.

నేను గ్రహించినదల్లా- సుధాకర్ నిర్మాతల అడుగులకు మడుగులొత్తడు ఎవర్నీ వెళ్ళి వేషం యివ్వమని అడగడు. బావమరిది ఎస్పీబాలసుబ్రహ్మణ్యం పెద్ద నేపధ్యగాయకుడూ, సంగీతదర్శకుడున్నప్పటికినీ- ఆయన పేరును గానీ ఆయన్నుగానీ కించిన్మాత్రము ఉపయోగించుకున్నట్టూ తోచదు.

ఆత్మగౌరవమూనూ, స్వయంశక్తినీ, దైవ అనుగ్రహాన్నీ విశ్వసించే మంచి మనిషిలా తోస్తున్నాడు.

తమిళ టి.వి. సీరియల్స్‌లో హుందా గల పాత్రలు ధరిస్తున్న విషయం తమిళచిత్రాల్ను నిర్మిస్తున్న ఎస్.పి.చరణ్ (ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కుమారుడు)కు తెలియకుండా ఉంటుందా? మేనత్త భర్తగా గాకపోయినా తమిళ బుల్లితెరపై కారెక్టర్ ఆర్టిస్టుగా పేరొందిన నటుడని తెలియదా- వారెంతో మంచివాళ్ళే ఎంతోమంది కొత్తవాళ్ళను పరిచయం చేస్తున్నవారే!

వాళ్ళ అంతర్విషయాలు మనకు తెలియవు. మనం కలుగచేసుకోనవసరమూ లేదు. ఇలాటి కారెక్టర్ ఆర్టిస్టులను ఉపయోగించుకోకపోవడం తెలుగు, తమిళ తెర దురదృష్టం. శుభలేఖ సుధాకర్ చక్కని ఆర్టిస్టుని అతని తమిళ టి.వి. సీరియల్స్‌ను చూచి అతని నటనకు ముగ్ధుడనయ్యాను తక్క, సుధాకర్‌తో నాకేరకమైన స్నేహమూ లేదు, సంబంధమూ లేదు. ఒక ఊరువాళ్ళమూ కాము. ఒక స్కూలులో చదివినవాళ్ళమూ కాము. బంధుత్వమూ- లేదు.

సుధాకర్ మంచి నటుడు. ఎస్.పి శైలజ మంచి గాయని, ఆమె కూడా ఏ సినిమాల్లో ఎక్కువగా పాడుతున్నట్లు లేదు. నేను తీసిన అనువాద చిత్రములో పిలిపించి (చంటిబిడ్డ తల్లి) పాట పాడించాను. అప్పుడామె మంచి గాయని- యని ఆ పాటకు సరిపోతుందని పిలిపించాను. రాజశ్రీ వ్రాసిన ఆ పాటను ఆమె ఎంతో చక్కగా పాడింది. అంతకు ముందు ఆమె పేరు నాకెందుకు స్ఫురించలేదా-నని బాధపడ్డాను. నమ్మకం వమ్ముకాలేదు.

కర్మ సిద్ధాంతమును శుభలేఖ సుధాకర్ విశ్వసిస్తాడని అతని జీవిత విధానమును గ్రహిస్తున్నాను.

**కర్మణ్య కర్మయఃపశ్యేత్, అకర్మణి చకర్మ యః।**
**సబుద్ధిమాన్ మనుష్యేషు సయుక్తః కృత్స్న కర్మకృత్॥**

-కర్మయందు అకర్మ, అకర్మయందు కర్మను దర్శించువాడు బుద్ధిశాలి. అతడు యోగ్యుడు- సమస్త కర్మలనూ విడిచిపెట్టడు అర్జునా! అన్నాడు కృష్ణ భగవానుడు. అట్టి విధంగా శుభలేఖ సుధాకర్ దంపతులకు కల్గిన ఒక్క కుమారుణ్ణి సినిమారంగ ఛాయలకు రానీయలేదు. అతణ్ణి మంచి విద్యావంతునిగానూ, ఉన్నత అధికారార్హతలు కలవానిగా తీర్చిదిద్దాలనేమో - న్యూఢిల్లీలో ఎం.బి.యె చదివిస్తున్నారు. భగవదనుగ్రహంతో ఆ కుమారుడు ఓ ఉన్నతోద్యోగం చేయాలనీ, యోగివంటి యోగ్యతలు కల శుభలేఖ సుధాకర్ కలలు ఫలించాలనీ, మా ఏలిక 'ఏడుకొండల వేంకటేశ్వరుణ్ణి' ప్రార్థిస్తున్నాను.

**కర్మణ్యేనాధికారస్తే మాఫలేషు కథాచన**

శుభలేఖ సుధాకర్ ఏ కర్మవాసనలూ కోరకుండా చేస్తున్న నట రాజాంకిత కృషిని చూచి, భగవంతుడు ఇప్పట్నుంచయినా- ఆయన సామర్థ్యానికి తగిన నట జీవితాన్నీ ప్రసాదించాలి, ఫలం అనుభవించేట్టు చేయాలి. **శుభమ్ భవతు**

# స్నానం ప్రాశస్త్యం

సనాతన భారతీయ సంస్కృతి సంప్రదాయంలో స్నానానికి ఎంతో విశిష్టత ఉంది. కేవలం శరీరాన్ని శుభ్రపరచుకోవడం స్నానం కాదు. నిత్యం సంస్కారం నిర్మలత్వం నిబిడీకృతమై ఉంది. స్నానం మనస్సును ఉత్తేజపరుస్తుంది. పూజ, జపం, హోమము వంటీ దైవ సంబంధకార్యాలను చేయటానికి ముందు స్నానం చేయుట ముఖ్యము. ఈ స్నానం వల్ల ఏకాగ్ర మనస్సుతో పూజాది కార్యక్రమాలను చేయవచ్చు. దైవం పై మనస్సును లగ్నం చేయవచ్చు. ఈ నియమాలను ఆర్ష సంప్రదాయం విధించింది. ప్రాతఃకాలంలో నిద్రలేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేయాలని స్మృతులు పేర్కొన్నాయి. స్నానం వలన రెండు ఫలితాలు కలుగుతాయి. 1 దృష్టఫలం. 2 అదృష్టఫలం.

'దృష్టఫలం' అంటే మన కంటికి కనిపించేది. స్నానం చేయటం వలన శరీరశుభ్రత, ఆరోగ్యముగా ఉండుట దృష్టఫలం అంటారు. 'అదృష్టఫలం' అంటే మన కంటికి కనిపించనది. స్నానం కారణంగా కలిగే పుణ్యఫలాన్ని అదృష్టఫలం అంటారు. ప్రాతఃకాలస్నానం:–

**శ్లో॥ ప్రాతఃస్నానం మహాపుణ్యం సర్వపాప ప్రణాశనమ్ ।**
**యః కుర్యాత్ సతతం విప్రో విష్ణు లోకే మహీయతే ॥**

– అంటే ప్రాతఃకాలంలో చేసే స్నానం ఎంతో పుణ్యప్రదం. పాపాలన్నీ హరించబడతాయి. స్నానాన్ని ఆచరించేవాడు వైకుంఠాన్ని చేరుతాడని పద్మపురాణం చెబుతుంది.

**శ్లో॥ అజ్ఞానాద్యది వామోహాద్రాత్రౌ యద్దురితం కృతమ్ ।**
**ప్రాతాః స్నానేన తత్సర్వం శోధయంతిద్వి జోత్తమాః॥**

– అంటే అజ్ఞానం వల్ల, మోహం వల్ల రాత్రివేళల్లో చేయబడే పాపకార్యాల వల్ల శరీరదోషాలు కలుగుతాయి. ఈ ప్రాతఃకాలస్నానం వల్ల ఆ దోషాలన్నీ నశిస్తాయనే విష్ణు స్మృతిలో చెప్పబడింది.

ప్రాతఃకాలంలో స్నానం చేయడంవల్ల మనకు రూపం, పుష్టి, బలము, తేజస్సు, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, దుస్వప్న నాశనం, తపస్సు చేయగల శక్తి, గ్రంథపఠానాశక్తి లభిస్తాయని పక్షస్మృతి చెబుతుంది.

## 1.స్నానం ఎక్కడ చేయాలి?

**శ్లో॥ ఉత్తమంతు నదీ స్నానం తటాకీ మధ్యమం స్మృతమ్।**
**కూపస్నానం తు సామాన్యం, భాండస్నానం వృథా భవేత్ ॥**

నదీస్నానం ఉత్తమం, తటాకస్నానం మధ్యమం, బావినీటితో చేసే స్నానం సామాన్యం, కుండలో నిల్వవుంచిన (భాండజలం) నీటితో స్నానం అధమాధమం అని స్మృతిశాస్త్రం చెబుతోంది.

సంధ్యావందనం, దేవకార్యంలాంటి నిత్యకర్మలు చేయడానికి, నదిలోగానీ, తటాకంలోగానీ, సరోవరంలోగానీ, సహజజలపాతాల్లోగానీ స్నానం చేయడం మంచి దని విష్ణుపురాణం చెబుతుంది. సముద్రస్నానం ఇంకా ఎంతో విశేష ఫలితాన్నిస్తుంది. అన్ని రోజులలో సముద్రస్నానం చేయకూడదు; కేవలం పర్వదినాల్లో, సంక్రమణ రోజుల్లో మాత్రమే సముద్రస్నానం చేయవచ్చు.

## 2. స్నానం చేసేటప్పుడు పాటించవలసిన నియమాలు:

నదులలో, తటాకాలలో పుణ్యస్నానాలు చేసేటప్పుడు, అక్కడి మట్టిని, నీటిని తీసుకొని వాటితో చేతులను, పాదాలను ప్రక్షాళన చేసుకోవాలి. తరువాత స్నానం చేసి ఆచమనం చేయాలి. ప్రాణాయామం చేసి కుడిచేతిలోకి నీటిని తీసుకొని స్నాన సంకల్పాన్ని చెప్పుకోవాలి. లేదా పురోహితునితో చెప్పించుకోవచ్చు. స్నానం, దానం, జపం, వ్రతం, పూజాది కార్యాలను చేసేటప్పుడు, మరియు అశుభ కార్యాల లోను, కూడా సంకల్పం చెప్పుకోవాలని శాస్త్రం చెబుతోంది. సంకల్పం తరువాత

*పుష్కరాల సమయంలో గంగా, నర్మదా, సరస్వతీ, యమునా, గోదావరీ, కృష్ణ, కావేరీ, భీమరధి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధూ, ప్రణీతానదులలోనికి బ్రహ్మ, సర్వదేవతా సమన్వితుడై, పుష్కరునితో కలిసి ఆవాహనమై ఉంటాడు. ఈ జలాలన్నీ ఓషధుల విశేషంగా ఉండి, పాపసంహారం చేయునట్టివిగా ప్రభావితమై ఉంటాయి. ఈ పుణ్యనదులలో పుష్కరాల సమయంలో స్నానాలు చేస్తే మనకు దేహశుద్ధిని, మంచిబుద్ధిని, ఆహారాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తూ ఆధ్యాత్మికతకు అంతిమ స్థానమైన ముక్తి లభించునని శాస్త్రాలు చెబుతున్నాయి.*

**శ్లో॥ అపామధిపతి స్త్వంచ తీర్థేషు నివసిష్యసి ।**
**వరణాయ నమస్తుభ్యం స్నానా నుజ్ఞాం ప్రయచ్ఛామే ॥**

అని వరుణదేవుని ప్రార్థించి నమస్కరించాలి

**శ్లో ॥ గంగేచ యమునేచైవ గోదావరీ సరస్వతీ**
**నర్మదే సింధు కావేరీ జలే స్మిన్ సన్నిధింకురు ॥–**

అంటూ శ్లోకాన్ని పఠిస్తూ గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధూ కావేరి మొదలైన పుణ్యనదుల తీర్థాలను స్నానం జలంలోకి ఆహ్వానించి స్నానం చేయాలి. గంగా స్నానంలో మాత్రం గంగా స్తోత్రాన్ని మాత్రమే పఠించాలి. నదులలో, పుణ్యక్షేత్రాల తీర్థాలలో స్నానం చేసేటప్పుడు తల్లిదండ్రులను తలచుకుంటే, స్నాన ఫలంలో పన్నెండవవంతు వారికి లభిస్తుంది.

నదీ ప్రవాహాల్లో, కోనేర్లలో స్నానం చేసేటప్పుడు బొడ్డులోతు నీళ్ళలో నిలబడి, చేతి బొటనవేళ్ళతో చెవులను, చిటికిన వేళ్ళతో ముక్కు రంధ్రాలను మూసుకొని, నీటిలో మూడుసార్లు మునిగి స్నానం చేయాలి. అప్పుడే స్నానఫలం లభించును. కానీ ముత్తైదువులు మాత్రము ఎట్టి పరిస్థితులలోనూ నీటిలో మునిగి స్నానం చేయరాదు. జడను విప్పుకొని, దోసిలితోగానీ, చెంబుతోగానీ, నీటిని తలపై వేసుకొని స్నానము చేయాలి. వితంతువులు మాత్రం మగవారిలాగే నీటిలో మునిగి స్నానం చేయవచ్చు.

**3. తలస్నానం:** ప్రాతఃకాలంలో మొదటిసారి మాత్రమే తలస్నానం చేయాలి. తరువాత స్నానాలు మామూలు స్నానాలు. మరణసమయంలోనూ, శవాన్ని మోసినప్పుడు, స్మశానానికి వెళ్ళినప్పుడు తలస్నానం తప్పకుండా చేయాలి.

**4.దిగంబరస్నానం:** "అవగాహ్యాజతే నగ్నః వస్త్రంనః పరిశోధమేత్" అంటే పురుషులైనా, స్త్రీలైనా కట్టుబట్టలతోనే స్నానం చేయాలి. దిగంబరంగా (నగ్నంగా) చేయకూడదు. ఈ దిగంబర స్నానం వల్ల జల అధిష్టాన దేవతకు అపచారం చేసినట్లవుతుంది. పాపం కలుగుతుంది, నరక ప్రాప్తి కలుగుతుందని శాస్త్రం.

**5. చన్నీటి స్నానం:** సాధారణంగా చన్నీటి స్నానం చేయడం శ్రేష్ఠం. అనారోగ్యంతో వున్నప్పుడు వేడినీటితో స్నానం చేయవచ్చని శాస్త్రం చెబుతుంది. జన్మదినమురోజు, సంక్రమణరోజు, ఆదివారం రోజు, సప్తమి, పూర్ణిమ, అమావాస్య తిథులలో, జపాలు, పూజలు, వ్రతాలు, దానాలు చేసేటప్పుడు, మరణం సంభవించినప్పుడు, రజస్వలలో వున్న స్త్రీలను, మైలలో వున్నవారిని ముట్టినప్పుడు, స్మశానానికి వెళ్ళినప్పుడు, శవాన్ని మోసినప్పుడు తప్పనిసరిగా చన్నీటితో తలస్నానం చేయాలి. వేడినీటితో స్నానం చేయకూడదంటుంది శాస్త్రం.

స్నానం చేసిన తర్వాత తడిబట్టలను క్రిందికి విడువరాదు. వాటిని విధిగా పై

### ఒంటిమెట్ట శ్రీరామచంద్రునికి సీతారామ కల్యాణం!

సీమాంధ్ర ప్రభుత్వం – శ్రీరామ నవమి సందర్భములో జరిపే 'సీతారామ కల్యాణం' ఒంటిమిట్టలోని శ్రీరామాలయంలో జరుపాలని అధికారికంగా నిర్ణయించింది.



భాగం నుండి తీయాలి. స్నానం తరువాత పొడి వస్త్రంతోనే దేహాన్ని తుడుచుకోవాలి. పూజలు వ్రతాలు చేసే సమయంలో మడిబట్టలను, శుభ్రమైన బట్టలను ధరించాలి.

స్నానాన్ని చేసే సమయాన్నిబట్టి స్నానాన్ని నాలుగు విధాలుగా విభజించారు : అవి 1.ఋషిస్నానం, 2. దైవస్నానం 3.మానవస్నానం 4. రాక్షసస్నానం

**1. ఋషిస్నానం:–** బ్రహ్మముహూర్తంలో 4 గంటల నుండి 5 గంటల మధ్యలో చేసే స్నానాన్ని 'ఋషిస్నానం' అంటారు. ఈ స్నానం ఎంతో శ్రేష్ఠమైంది. అత్యుత్తమైనది. అధిక ఫలితాన్నిస్తుంది. ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తుంది.

**2. దైవస్నానం:** ఉదయం 5 గంటల నుండి 6 గంటల మధ్యకాలంలో చేసే స్నానాన్ని 'దైవస్నానం' అంటారు.

**3. మానవస్నానం:** ఉదయం 6 గంటల నుండి 7 గంటల మధ్యకాలంలో చేసే స్నానాన్ని 'మానవస్నానం' అని అంటారు. ఈ స్నానం అధమ ఫలితాన్నిస్తుంది.

**4. రాక్షసస్నానం :** సూర్యోదయం అయిన తర్వాత 7 గంటల తర్వాత చేసే స్నానం.

**విధులనుబట్టి స్నానాలు:–**

**1. నిత్యస్నానం:** రోజూ దేవతార్చన, పారాయణం, జపం, ధ్యానం మొదలైన వాటిని ఆచరించేందుకు చేసే 'నిత్యస్నానం' అని అంటారు.

**2.నైమిత్తిక స్నానం:** రజస్వల అయిన స్త్రీలను మైలలో వున్నవారిని ముట్టుకొన్నప్పుడు, స్మశానానికి వెళ్ళినప్పుడు, శవాన్ని మోసినప్పుడు, మరియు నివారణ కోసం చేసే స్నానాన్ని నైమిత్తిక స్నానం అని అంటారు.

**3. కామ్య స్నానం:** వైశాఖ, ఆషాడ, కార్తీక, మాఘ మాసాలలో చేసే పుణ్యస్నానాలు, యజ్ఞ యాగాదులను చేసేటప్పుడు ఏదైనా ఫలితాన్ని ఆశించి ఆచరించే స్నానాన్ని 'కామ్యస్నానం' అని అంటారు.

**4.క్రియాంగ స్నానం:** పిత్రుదేవతల తృప్తికోసం ఆబ్దికం లాంటి పితృకార్యాలను చేసేటప్పుడు చేసే స్నానం.

**5. మలామకర్షణస్నానం:** శరీరాని కంతా నూనె పూసుకుని చేసే స్నానాన్ని మలాపకర్షణ స్నానం అని అంటారు.

**6. క్రియాస్నానం:** పాప పరిహారం కోసం పుణ్యక్షేత్రాలలోని పవిత్ర తీర్థాలలో చేసే స్నానాన్ని 'క్రియాస్నానం' అని అంటారు.

**ప్రత్యామ్నాయస్నానాలు:** అనారోగ్యకారణంగా నీటితో స్నానం చేయలేనప్పుడు, స్నానం చేసేందుకు అవకాశం లేనప్పుడు జపం, ధ్యానం లాంటి కర్మలను ఆచరించేటప్పుడు, కొన్ని ప్రత్యామ్నాయ స్నానాలను మన శాస్త్రాలు సూచించాయి. వీటిని 'గౌణస్నానాలు' అని కూడా అంటారు. అవి.

**1. మంత్రస్నానం:** స్నానం సంబంధిత మంత్రాలతో (ఆపోహిష్ఠాదిమంత్రాలతో) నీటిని తలపై చల్లుకోవడాన్ని 'మంత్రస్నానం' అని అంటారు.

**2. భస్మస్నానం:** పరమేశ్వరుని నామాన్ని స్మరిస్తూ శరీరానికంతా విభూతిని పూసుకోవాడాన్ని 'భస్మస్నానం' అని 'భౌమస్నానం' అని అంటారు.

**3. ఆగ్నేయ స్నానం:** 'త్రాయుషం జమదగ్నే' అనే మంత్రాన్ని స్మరిస్తూ విభూతిని లేదా విభూతి కలిపిన నీటిని తలపై చల్లుకోవడాన్ని ఆగ్నేయస్నానం అని అంటారు.

**4. వాయువ్యస్నానం:** ఆవులు నడిచేటప్పుడు, వాటి గిట్టలవలన ఏర్పడిన గుంటలలోని మట్టిని తీసి, సంబంధిత మంత్రాలతో ఆ మట్టిని తలపై చల్లుకోవడాన్ని వాయవ్యస్నానం అని అంటారు.

**5. దివ్యస్నానం:** ఎండతో కూడిన వర్షంతో తడవడాన్ని దివ్యస్నానం అంటారు.

**6. మానసస్నానం:** "పుండరీకాక్ష" అనే నామాన్నిగానీ, అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతో పివా యః స్మరేత్ పుండరీకాక్షం, స బాహ్య భ్యాంతర శ్శుచిపి అనే మంత్రాన్ని చెప్పుకొని మానసికంగా చేసే స్నానం.

**7. కాపిలస్నానం:** తడిగుడ్డతో దేహాన్ని తుడుచుకోవడాన్ని 'కాపిలస్నానం' అని అంటారు.

**8. ధ్యానస్నానం:** విష్ణుపాదోదకాన్ని, తులసిపాదులోకి జలాన్నిగానీ, తులసి లేదా మారేడు దళాలతో కలిసిన జలాన్నిగానీ తలపై చల్లుకోవడం "ధ్యానస్నానం".

**9. మృత్తికాస్నానం:** పుణ్యనదీ జలాలతో తడిసిన నదీతీరంలో మట్టిని లేదా తులసి పాదులోని మట్టిని సంబంధిత స్నాన మంత్రాలను చెప్పుకుంటూ ధరించడాన్ని 'మృత్తికాస్నానం' అని అంటారు.

**10. సారస్వతస్నానం:** వేదవేత్తలు స్నానసంబంధిత మంత్రాలను చెబుతూ, పుణ్యనదీ జలమును తలపై ప్రోక్షించడాన్ని 'సారస్వతస్నానం' అని అంటారు.

ఈ ప్రత్యామ్నాయ స్నానాలన్నింటినీ, సంబంధిత స్నానమంత్రాలతో చేసినప్పుడు మాత్రమే స్నాన ఫలం లభిస్తుంది. ఈ ప్రత్యామ్నాయ స్నానాల అనంతరం కట్టుకొన్న వస్త్రాలను విడిచి , ఉతికి ఆరేసిన పొడి వస్త్రాలను ధరించాలి.

**స్నానం– వైజ్ఞానిక రహస్యం:** స్నానంలో ఎన్నో వైజ్ఞానిక రహస్యాలు ఉన్నాయి. మన శరీరం ఒక విద్యుత్ కేంద్రం వంటిది. మనదేహంలో ఎప్పుడూ విద్యుత్ ఉత్పత్తి అవుతూ, ప్రవహిస్తూ, బయటకు విడుదల అవుతుంది. మనశరీరంలో 24 ముఖ్యకేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి అవుతూ ఉంటుంది. ముఖ్యంగా కన్నులద్వారా విద్యుత్ విడుదల అవుతుంది.

సామాన్యంగా ఉదయం మేల్కొన్నప్పటినుండి, రాత్రి నిద్రించేవరకు శరీరంలో విద్యుత్ అధికంగా విడుదల అవుతుంది. మనం రాత్రి నిద్రించే సమయంలో, అన్ని ముఖ్య అవయవాలన్నీ విశ్రాంతిలో ఉంటాయి. అందుకే దేహంలో ఉత్పత్తి అయిన విద్యుత్ బయటికి పోయే అవకాశం లేదు. నిద్రించే సమయంలో కన్నులు మూసి వుండటంతో విద్యుత్ కన్నుల నుంచి బయటికి పోయే అవకాసం అస్సలు ఉండదు. అందుకే శరీరంలో విద్యుత్ అధికంగా నిల్వవుంటుంది. అయితే స్నానం చేసేటప్పుడు స్నానజలం విద్యుత్తును ఒక్కసారిగా పీల్చుకుంటుంది. అందుకే స్నానంతరం మనం ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉంటాం.

**శ్లో॥ వైశాఖ కీర్తికి మాఘి తిథయో తీవ పూజితః ।**
**స్నాన, దాన, వహీ నాస్తా ననే యోః పాండునంద ॥**

అంటే ప్రతి సంవత్సరం మనకు ఉన్న అన్ని పౌర్ణమిలలో వైశాఖ, కార్తీక, మాఘ మాసాలలో వచ్చే పూర్ణిమలు ఎంతో శ్రేష్ఠమైనవి. ఈ పూర్ణిమ రోజులలో స్నాన, దాన, జపాది సత్కర్మముల వల్ల మంచి ఫలితాలు లభించునని స్వయంగా శ్రీకృష్ణపరమాత్ముడు పాండునందనుడైన ధర్మరాజుకు తెలియజేశాడు.

**మా శ్రేయోమూర్తులు శ్రీ.కె.మల్లికార్జున (బళ్ళారి) సనాతన ధర్మాలను సరించేవారు. ఇతరులు కూడా సాంప్రదాయం పాటించాలని వారి అభిలాష.** ●


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

వశీకరణ కవచం
ధర రూ. 1000/- మాత్రమే
Vasikarna Kavacham




ఇంట్లో పిల్లలు మీ మాట వినడంలేదు. మాటకు మాట సమాధానం ఇస్తున్నారు. తల్లితండ్రులంటే భయభక్తులు వుండటంలేదు. ఏం చేయాలి? భార్య భర్తమాట వినదు. భర్త భార్య మాట వినడు.. ఏం చేయాలి? ప్రేమికుల్లో ఒకరిమాటకు మరొకరు విలువ ఇవ్వడంలేదు.. ఏంచేయాలి? ఆఫీసులో మీ పై అధికారి మీ సహనాన్ని పరీక్షిస్తున్నారు. వారి మెప్పు పొందాలంటే ఏం చేయాలి. డబ్బు తీసుకున్న బాకీదార్లు అనుకున్న సమయానికి తిరిగి చెల్లించడం లేదు.. ఏం చేయాలి? విద్యార్థులకు చదివినది గుర్తుండటంలేదు.. ఏం చేయాలి? అవివాహితులకు వివాహయోగం త్వరగా కలగటంలేదు.. ఏం చేయాలి? వీటన్నిటికీ ఒకే సమాధానం వశీకరణ కవచ ధారణ. – చల్లా జయదేవానంద శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

:09840259871, 04424837505
Estd. 1975
BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra

# శతవత్సర శతపత్ర సుందరుడు బాలాంత్రపు రజనీ కాంతారావు!



## -విజయవాడలో 'రజని' శత సంవత్సర విభవమును వైభవంగా జరిపారు !!-

నవ నవ వసంతచలనముల లాస్యముల భవదమృత లావణ్య చరణ విలనము- అని లండన్‌లో టంగుటూరి సూర్యకుమారి యెదుట పాడటం ఒక విచిత్ర వినూత్న విమల సన్నివేశం. ఆశువుగా కీర్తన చెబుతూ, సరళమైన లలితస్వరం కూర్చడం కూడా రజనీకాంతరావుగారికే చెల్లు. రజనీ వ్రాసిన ఎక్కువ పాటల్ని పాడి, గ్రామ ఫోను రికార్డులకిచ్చిన ఖ్యాతి టంగుటూరి సూర్యకుమారికే దక్కుతుంది. ఆమె పాడిన ప్రతీ ఒక్క పాటా సూపర్‌డూపర్ హిట్టే. ఆనాడంత విరివిగా గ్రామఫోను రికార్డులు వచ్చేవి. ప్రచారమాధ్యమం యెక్కువగా లేకపోయినప్పటికీనీ, శ్రవ్య ప్రసారమాధ్యమం ఎక్కువగా ఉండేది. ఆకాశవాణిలో రజనీ పాటలకెంతో మంది శ్రోతలుండేవారు. సూర్యకుమారితోబాటు ఎస్.రాజేశ్వరరావు, ఘంటశాల, బాలసరస్వతిలు కూడా రజనీపాటలు పాడేవారు. రజనీ పాటల సాహిత్యం గొప్పదా? స్వరలాలిత్యం గొప్పదా- అంటే దేనికదే గొప్పది.

లలిత గీత స్వరకల్పనలో, గీత రచనలో, శబ్దాలంకార సొంపులో బాలాంత్రపు రజనీ కాంతారావుతో పోల్చదగ్గ వారింతవరకూ పుట్టులేదు. ఆకాశవాణికి సంగీతపు సొగసులు దిద్ది, రజని అత్తరు పరిమళాలను పూయించారు.

సినిమాల్లో ఎన్నో అవకాశాలు వచ్చినా, ఆయన అంతగా ఆ రంగప్రవేశం చేయలేదు. పైగా ఆకాశవాణిలో నాకు గౌరవప్రదమైన ఉద్యోగంలో ఉన్నాను. చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టడమంత ఆరోగ్యప్రదం కాదు. కానీ ఆయన స్వరమేళవింపులు అనుసరింపులూ చాలా తెలుగు చిత్రాల్లో వినిపించాయ్. వాహినీ వారి స్వరసీమలోని ఓహోహో పావురమా- అన్న పాట రజనీ స్వరకూర్పే అంటారు.

విచిత్రమేమంటే ఒకసారి భానుమతిగారికో పెద్ద సత్కారసభ జరిగింది. ఈ సభకు వెళ్ళిన రజనీ ఒహోహో భానుమతీయనీ ఒహోహో పావురమా। సరళిలో పాడేసరికి భానుమతి యెంతో పులకించి పోయారు. అప్పటికప్పుడు ఆశువుగా పాడిన పాటే.

ఇహ అవార్డుల్లో- అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న సంతోష సమయాన్ని అప్పుడప్పుడు తలుచుకుని పులకరిస్తుంటాను. ఆయన మంచి సాహితీ అభిరుచీ, ప్రియత్వం కలవారు. ఆయన నివాసమే ఓ పెద్ద గ్రంథాలయం.

రజనీ సంగీత వల్లరి 194౦ నుంచీ 1990 వరకూ ఓ అర్ధ శతాబ్దం శుక్ల పక్ష చంద్రుని చంద్రికలా భాసిల్లింది. చల్లగాలిలో యమునా తటిపై శ్యామ సుందరుని మురళీ- అన్న రజనీపాట ఎస్.

## మనసున అనురాగం లేనినాడు 'రాగం' సృష్టించలేరు! తనువూ, మనసూ కలిసే లలితానురాగం సృష్టిస్తుంది ॥



అందము ఆనందమూ కావాలి! ఆనందం మకరందాస్వాదనం చేయాలి! రజనీ చేసిన పని అదే! - ఎవరా రజనీ?

'రజనీ' అంటే మాకు బాగా తెలుస్తుంది !

'రజనీ బాణీ' అంటే లలితరాగశ్రవణి యనిపిస్తుంది!

ఆ తోటలో నొకటీ- ఆరాధానాలయమూ ఆలయంబులోని అందగాడెవరో - పాట విన్నా 'హాయని కిన్నెరయేద్చెను తన మనోహరుడు శిల యైనాడని- తానేమో ఒక వాగైనానని' పాట వినుసరికి రజనీ పాటను కుంటాం- ఇది విశ్వనాథ సత్యనారాయణ గారి కిన్నెరసాని పద్యసౌరం ।

'మాదీ స్వతంత్రదేశం- మాదీ స్వతంత్రజాతీ' విన్నప్పుడిప్పటికినీ మనది స్వతంత్రదేశమా। మనది స్వతంత్రజాతి'యా అనే అనిపిస్తుంది అది 'రజనీ పాట'- సూర్యకుమారి నోట వినే సరికి మనది స్వతంత్రదేశమా? మనది స్వతంత్రజాతియా అందుకేనా హిందువులు- భగవద్గీత పనికిరాదంటున్నారా- అనేభావం కలుగుతుంది.

రజనీ స్వరబ్రహ్మ-పాదస్థితి- లయబద్ధుడు అని త్రిగుణాత్మకంగా అభివర్ణించవచ్చు! పదాలనంత చక్కగా వాడినవాడు పోతన- నన్నయ్య । ఆధునికయుగంలో శ్రీశ్రీ, ఆరుద్ర- శ్రీశ్రీ ఆరుద్రల మధ్య శబ్ద అర్థాలంకార పదభావకునిగా ఉంటూ- వారు ప్రస్థానం పొందిన తరువాత కూడా దశాబ్దముల పాటు చివుళ్ళు తొడుగుతున్నాయవి రజనీ నటరాజత్వమనాలి.

పసిడి మెరుంగుల తళతళలు। పసిమి వెలుంగుల మిలమిలలు । గౌతమి కృష్ణల గలగలలు। గుడి జే గంటల గణగణలు' అంటూ పదాల రవళిలో ఆడుకున్న మురళీ ఆయనే !

ఓ విభావరీ! నీ హార హీర నీలాంబరధారిణీ! మనోహారిణీ! ఓ విభావరీ! అంటూ వ్రాసిన 'రజనీ' కీ- కొండవీటిసింహం చిత్రంలో- ఆకాశం అంచులు దాటే ఆవేశం నా గీతం పలికిన నా జీవితమే సంగీతం- సంగమించు ప్రణయంలో ఉదయరాగ సింధూరం' - అంటూ వేటూరి వేసిన అక్షరాల్లో రజనీ అక్షరాల ఊట ఉబికి ఎగసిందా- యనిపిస్తుంది.

లలిత సుమవల్లికా సుమంత గీతాల్లో 'రజనీ' పదాల రజు పడకుండా ఉండదనేది సత్యం.

అందము, ఆనందము కావాలి! ఆనందం మకరందాస్వాదనం చేయాలి! రజనీ చేసిన పని అదే! - ఎవరా రజని!

**రజనీ 90వ సంవత్సరములో అనుకుంటాను- విశాఖపట్టణంలోని శ్రీమహాకామేశ్వరపీఠం అధిపతి మహర్షి యద్దనపూడి అయ్యన్నపంతులుగారు, రజనీని నన్నూ మేళతాళాలూ పూర్ణ కుంభస్వాగతంతో, కళాభారతి వేదిక మీదకు తీసుకుని వెళ్ళి సత్కరించారు. మా ఇరువుర్నీ మేళతాళాలతో తీసుకుని వెళ్ళిన మహత్తర సందర్భమిది. అంతవరకూ రజనీగారి పేరును వినడమేగాని, ప్రత్యక్షంగా చూడలేదు. వారి ప్రక్కన నన్ను పూర్ణకుంభ స్వాగతంతో తీసుకుని వెళ్ళి సత్కరిస్తారని ఊహించలేదు. అప్పటికే ఆయన్ను చేయిపట్టుకుని తీసుకుని వచ్చారు.**

రాజేశ్వరరావు నోట ఎంత హాయిని గూర్చిందో– విన్న శ్రోతలకే విదితమవుతుంది.

గురువుకు తగ్గ శిష్యులుగా శ్రీ పాద పినాకపాణి. నేదునూరి కృష్ణమూర్తి రాణించడమేగాకుండా వారెందరో శిష్యుల్ని తయారుచేసారు. రజనీ ఔన్నత్యం చెప్పడానికి పై శిష్యవర్గమే చాలు. ఆకాశవాణి ఉద్యోగానికి ముందు కాంట్రాక్టు పద్ధతిపై ఎన్నో సంగీత నాటక కార్యక్రమాల్ని చేసారు. శ్రీశ్రీ వ్రాసిన నాటికతో రంగప్రవేశం చేసారు. ఎస్. రాజేశ్వరరావు సంగీత నాటకాల్లో పాత్ర ధరించారు.

'చండీదాసు' అనుపేరున సంగీత నాటకం వ్రాసి సంగీతం కూర్చడమేగాకుండా అందులో చండీదాసు పాత్రను ధరించారు. ఇంకా పలు నాటకాలు, పలు ప్రధాన పాత్రలు, పలు శ్రవ్యనాటికలకు స్వరకల్పన చేసి, అర్థ శతాబ్దం పాటు లలిత సంగీతముతో బాటు స లలిత సాహిత్యాన్ని వినిపింపచేసారు.

1984 సం॥ములో లండన్‌లోని బర్మింగ్‌హోమ్‌లో ఓ సంగీత కార్యక్రమమును నిర్వహించి, శ్రోతలనుల్లసింపచేసారు. భారతదేశంలోని వివిధ నగరాల్లోని ఆకాశవాణి కేంద్రంలోని వివిధ నగరాల్లోని ఆకాశవాణి కేంద్రముల్లో పనిచేసారు. ఎక్కడ ఏ నగరంలో పనిచేసినా ఆయన లలిత సంగీతమ్మీదనే దృష్టిని సారించారు.

నిజం చెప్పాలంటే– ఆయన ఆకాశవాణి సంగీత రూపశిల్పి. ఆయన తన సంగీత ఝురికి అడ్డుగోడలు కాలేదు. ఆకాశవాణిలో 'భక్తిరంజని' పాటల కార్యక్రమానికి రజనీయే ఆద్యుడు.

సినిమాల్లో రజనీ కలం, స్వరం లేదా అంటారేమో తొలిరోజుల్లో వై.వి. రావు నిర్మించిన 'మానవతి' చిత్రాల్లోని పాటల రచయిత, సంగీత దర్శకుడూ రజనీయే! కృష్ణవేణి నిర్మించిన 'లక్ష్మమ్మకథ' చిత్రంలోని పాటలన్నిటినీ రజనీ వ్రాసారు. స్వర కల్పన కూడా ఆయనే చేసారు. ఆ చిత్రం టైటిల్స్‌లో ఘంటసాల పేరుంటుంది. 'పేరంటాలు' చిత్రంలో కూడా రజనీ పాటలు వ్రాసారు.

సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, ఎస్. రాజేశ్వరరావుగారి స్వరకల్పనలో కూడా రజనీ బాణీయే ఉంటుంది. 'విప్రనారాయణ' చిత్రంలో భానుమతి పాడిన 'ఎందుకోయి తోట మాలి అంతులేని 'ఆవేదన' అనుపాటలో రజనీ పోకడలు కనిపిస్తాయ్, వినిపిస్తాయ్.

రజనీకి 'వాగ్గేయకారుడు'. వాగ్గేయకార లక్షణ సమన్వితుడు. వాగ్గేయకార పక్షపాతి అనడానికి ఆయన వాగ్గేయకారుల చరిత్ర గ్రంథాన్ని వ్రాసారు. 'శతపత్రసుందరి'గా రజనీగేయాల సంపుటి వెలువడిందని తెలియగానే, నేను వ్రాసిన శత సహస్ర జ్యోతుల తేజంలో రహస్యమేముందోగానీ– అని పాటల సంపుటికి 'శతపత్రసుందరి' పేరు పెట్టిన వాణ్ణే 'గోటేటిగీతలు'గా మార్చివేసాను.

ఉమర్ ఖయ్యామ్ తత్వాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు 'అతిథిశాల'గా వ్రాసారు. ఈ రూపకానికి రజనీగారే స్వరకల్పనచేసి, 'ఉమర్ ఖయ్యామ్' పాత్రను ఆయనే ధరించారు. ఇలా చాలా విషయాల్లో రజనీకాంతరావు ప్రతిభల్ని పేర్కొనవచ్చు.

రజనీ స్వరకల్పనలో కొట్టొచ్చినట్లుగా కనిపించే అరెబ్బీ పర్షియన్ ఫణతులూ, స్పానిష్ బాణీలను కూడా తనదైన రజనీ బాణిలోకి అన్వయింపచేసుకొనేవారు.

ఆయన 'కొండనుంచి కడలిదాకా' అని చేసిన, కార్యక్రమం భౌగోళిక నేపథ్యం కలది. భారత నైసర్గికం ఆ కార్యక్రమంలో వినిపిస్తుంది. కొండల్లో నది పుడుతుంది. కడలి దాకా ప్రవహించి అందులోనే కలిసి పోతుంది.

రజనీ కుటుంబం సాహితీ కుటుంబం సుప్రసిద్ధ వేంకట పార్వతీశకవుల్లోని బాలాంత్రపు వెంకటరావు రజనీ జనకులు 1920 సం॥ము జనవరి 29న ఆయన నిడదవోలులో పుట్టారు. రజనీ స్వరసాహితీ మేళవింపు చేసిన పాటలు రాశిలో తక్కువైనా వాసిలో గొప్పవి. ఆకాశవాణి లలిత సంగీత పాటలు శ్రవ్య నాటికలు అధికమే! ఆయన పాటలు పాడిన టంగుటూరి సూర్యకుమారి భానుమతి, బాలసరస్వతి, ఘంటసాల ఎస్. రాజేశ్వరరావుగార్లు మార్కుల్ని కొట్టేసారు.

ఎప్పటికీ ఆయన ఆ పాట రెక్కలు విచ్చుకుని సంగీతాభిమానుల యిళ్ళల్లో దోగాడుతూనే ఉంటుంది. శతపత్ర సుందరా! శతంజీవివి! లలితస్వర సలలితసాహిత్యము– సహస్ర వర్ష సంజీవిని చేసావ్! సెహబ్బాష్. ●


**Statement about ownership and other particulars about Newspaper**
**"PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Chennai |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | **G.V. RAO** |
| Nationality | : | Indian |
| Address | : | Printed at<br>**Goteti Graphics**<br>64, Thambaiah Reddy Road,<br>West Mambalam, Chennai - 600 033. |
| 4. Publisher's Name | : | **G.V. RAO** |
| Nationality | : | Indian |
| Address | : | 64, Thambaiah Reddy Road,<br>West Mambalam, Chennai - 600 033. |
| 5. Editor's Name | : | **G.S. RAMARAO** |
| Nationality | : | Indian |
| Address | : | 64, Thambaiah Reddy Road,<br>West Mambalam, Chennai - 600 033. |
| 6. Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO**<br>64, Thambaiah Reddy Road,<br>West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28-2-2015 **(Sd.,) GV RAO**
Chennai - 600 033. PUBLISHER


# సంస్కృతీ రత్న కె.ధర్మారావు సత్కారార్హుడు

## - అర్థ శతాబ్ది కృషికి దక్కిన గౌరవం!-



హైదరాబాదులోని సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వ్యక్తి కె.ధర్మారావు. అమెరికాలో కూడా తానా, ఆటా వారు జరిపే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకుంటూ వుంటారు. భేషజం యెరుగని వ్యక్తి చిరునవ్వే ఆయన చిరునామా.

దక్షిణ మధ్య రైల్వేలో చాలాకాలం పనిచేసారు. ఫిలిమ్ సెన్సార్ బోర్డు సలహాదారుల కమిటీలో కూడా ఉన్నారు. హైదరాబాదులోని సాంస్కృతిక, సంఘ కార్యకర్తలు ధర్మారావును 'సాంస్కృతిక రత్న' బిరుదుతో సత్కరించారు. న్యూయార్కులోని థియోలాజికల్ రీసెర్చి యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ నిచ్చి గౌరవించారు. ఈ సందర్భంగా భాగ్యనగరంలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ – వీరిని సత్కరించడం కూడా జరిగింది. పూర్వపు పోలీసు ఇన్స్‌పెక్టర్ జనరల్ శ్రీ ఆర్.ప్రభాకరరావు అధ్యక్షునిగా, శ్రీ మద్దాలి రఘురాం కార్యదర్శిగా ఎన్నో కళా సాంస్కృతిక సమావేశాలను నిర్వహిస్తున్నారు, గ్రంథ ప్రచురణలు కూడా చేస్తున్నారు. 38 సం॥ములు సుదీర్ఘ చరిత్రగల కిన్నెర ఆర్ట్సు కళా సాహితీ, సంస్కృతీ సంస్థ – మరో కళా సాంస్కృతికరత్న ధర్మారావును సత్కరించడమెంతో అభినందించదగిన విషయం. అయితే ఈ సత్కారములన్నీ 2014 సంత్సరంల్లోకి చేరినవే అయినప్పటికినీ ధర్మారావు విశిష్టతను పొందు పరచడం 'ప్రముఖాంధ్ర' ధర్మంగా భావిస్తున్నది.

సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ వంశీ సాంస్కృతిక ఇంటర్నేషనల్ సంస్థ కార్యదర్శిగా కె.ధర్మారావు విధులను నిర్వహించారు. ఆ సంస్థ అమెరికాలో బహుమతీ ప్రదానం చేసిన కార్యక్రమాల్లో కూడా ధర్మారావు పాల్గొన్నారు. తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జరిపిన ప్రపంచ చతుర్థ తెలుగు మహాసభలకు హైదరాబాదు నుంచీ కార్యకర్తలు పాల్గొనేట్టు చేసారు. ఆయన 'ఆంధ్రప్రభ' విలేఖరిగా కూడా పనిచేసినట్టు మాకు గుర్తు. ఇలాటి సౌమ్యమూర్తి మరెన్నో కార్యక్రమాలు చేస్తూ–తెలుగును మరుగుపడనీయని కృషి చేస్తూ – ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని ఏడుకొండలతేడును ప్రార్థిస్తున్నాం. ●

**జీ.వి. రావ్ పేజీ**
(గోటేటి వేంకటేశ్వరరావు)

కార్యమును శ్రద్ధతో, హృదయపూర్వకంగా ఆచరించినచో తప్పకుండా ఆ కార్యము విజయవంతమగును. - స్వామి వివేకానంద



# మా నాన్నగారితో నేను...

Every Father is a Hero to his son, Is it true? Yes it is true. ఎంతమంది వారి తండ్రులను గురించి అలా అనుకుంటారో తెలియదు. కానీ నేనలాగే అనుకుంటాను. ఈ మార్చి 7న ఆయనకు 83 ఏళ్లు. నా మనసులోని ఆలోచనలు ఈ కాగితంమీద పెట్టినప్పుడు ఆ భావ పరంపరకు అడ్డుకట్ట వెయ్యలేకపోయాను. ముందువి వెనుక, వెనకవి ముందు వుండవచ్చుకాని ఏదీ అతిశయోక్తి కాదు, అతి కాదు. నేనేది అతిగా రాయనూలేదు. ఆయనకు నాకు తెలిసిన చాలామంది హితులకు, స్నేహితులకు, బంధువులకు నేను రాసిన విషయాలు తెలిసే వుంటాయి.

మా నాన్నగారు నాగురించి ఎవరికైనా చెపుతున్నప్పుడు వీడికి సముద్రాల రాఘవచారి గారు అక్షరాభ్యాసం చేయించారు, చిత్తూరు వి.నాగయ్య గారు రామకృష్ణ మిషను స్కూలులో చేర్పించారు అని గర్వంగా చెపుతూ వుంటారు. వీడికి అన్ని ఘనంగానే జరిపించాను. అన్నప్రాశన, అక్షరాభ్యాసం, ఉపనయనం, పెళ్ళి అలాగే కాలేజికి స్కూటరు, సినిమాలకి వచ్చినప్పుడు కారు ఇలా ఎన్నో ఎన్నెన్నో – ఇవన్నీ డబ్బులుండి చేసినవా? కానేకాదు కష్టపడుతూ అమర్చుకొన్నవి. నా చదువయ్యాక (అదేలెండి ఓ బి.కాం. డిగ్రీ వెలగబెట్టాను) ఉద్యోగానికి వెళ్ళే ఆలోచనే రాలేదు. పెద్ద బిజినెస్‌వాడినవ్వాలని, పెద్ద పత్రిక నడపాలని, సినీ నిర్మాత అవ్వాలని, దర్శకుణ్ణి అవ్వాలని ఇలా సీతాకోకచిలుకలా నా ఆలోచనాసరళి మారుతూ వుండేది. కానీ చేతినిండా డబ్బు లేదు, రూపాయి వస్తువు కొనాలంటే పావలా చేతిలో వుండేది.

నాన్నగారిది వరిధనం పాలకొల్లుని ఆనుకుని వున్న గ్రామం. నవ్వుతూ అంటారు. చేతిలో వరిలేదు, ధనం లేదు నా వూరు వరిధనం అని. అక్కడనుంచి ఆయన కట్టుకున్న బట్టలతో చెన్నైకి వచ్చారు. చేతిలో డిగ్రీలు లేవు, తండ్రి సంపాదించిన ఆస్తి లేదు, వున్నదల్లా ఒక్కటే తమిళ మహాకవి చెప్పిన "సుందర తెలుగు", ఆ తెలుగుకి తోడు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ఆదుకునే ఆ ఏడుకొండలవాడు, అన్నివేళలా తోడుగా నిలబడ్డ ఇల్లాలు, భర్త తెచ్చిన పైసా పైసాను కూడబెట్టి ఒక చిన్న స్థలాన్ని కొనుక్కుని ఒక్కొక్క ఇటుకగా పేర్చి అనురాగం, ఆశయంతో కట్టుకున్న పొదరిల్లు (ఓ పాట వుందిగా మేడంటే మేడ కాదు, గూడంటే గూడు కాదు పదిలంగా కట్టుకున్న పొదరిల్లు మాది) కొన్ని సంవత్సరాలకు అది డాబా యిల్లు అయ్యింది. సినిమా పత్రికను స్వయంగా నడిపినా, సినిమా స్వయంగా తీసినా ఏ దురలవాటు జోలికి పోకపోవడం, సహచరులు వద్ద మంచివాడుగా గుర్తింపు పొందడం, అందుకేనేమో నాన్నగారికి స్వామి వెంకటేశ్వరారనంద "విద్యావిశారద" బిరుదునిచ్చినప్పుడు ప్రఖ్యాత హాస్యనటుడు శ్రీరాజ్‌బాబు నాన్నగారిని "నభూతో నభవిష్యత్" అన్న చందాన సన్మానించారు. అలాంటి సభ అంతవరకూ జరగలేదు. ఇకపై జరగబోదు కూడా. ఎందుకంటే మొత్తం తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆ సభకు తరలివచ్చారు. ఎన్.టి.రామారావు, నాగేశ్వరరావు, శోభన్‌బాబు, కృష్ణంరాజు, పి.వి.రాజమన్నారు, శ్రీ పుష్పగిరి శంకరాచార్య, శ్రీ బషీర్ బాబా వంటి హేమాహేమీలు పాల్గొని ఆయన మంచితనాన్ని మెచ్చుకున్నారు. "మంచి" అనే సన్మానపత్రాన్ని ఇచ్చారు.

అందరూ టాటాలు, బిర్లాలు అవక్కరలేదు. తాను గౌరవంగా వుంటూ, తన కుటుంబాన్ని పోషించుకుంటూ ఇంకో నలుగురికి చేయూతనిస్తున్న వాడు టాటా, బిర్లాతో సమానం. ఆయన జీవనపోరాటం ECG గ్రాఫ్‌లా ఎప్పుడూ ఎగుడుదిగుడులే. ఆ పల్లెటూరి నుంచి ఈ పట్నానికి పొట్ట చేత పట్టుకుని వచ్చి తను, భార్య, నాలుగేళ్ళ, నాలుగేళ్ళ తేడాలో ముగ్గురు మగపిల్లలు. అందులో నేను పెద్దవాడిన నాకు ఇద్దరు తమ్ముళ్లు, తను అంతగా చదువుకోకపోయినా తన పిల్లలను బాగా చదివించాలని ఆశయం, కోరిక. జీవితంలో ఆయనకెన్నో ఒడిదుడుకులు, హెచ్చుతగ్గులు, సినిమాల వల్ల, పత్రికల వల్ల ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి వాటిని మావరకు దరిచేరనియ్యలేదు. మా ముగ్గురికి మంచి చదువు చెప్పించారు. విద్య కామధేనువు వంటిది. కామధేనువు కోర్కెలు తీర్చినట్లు విద్య కూడా సుఖానిస్తుంది. అందుకే విద్యను గుప్తధనమన్నారు.

**న చోరచోర్యం నచరాజహార్యం**
**న భ్రాతృ భోజ్యం నచ భారకారీ**



**వ్యయేకృతే వర్ధతే ఏవనిత్యం**
**విద్యాధనం సర్వధన ప్రధానమ్** – అన్నారు భర్తృహరి.

అన్ని ధనాలలో ముఖ్యధనం విద్యాధనం, దొంగలు దొంగిలించలేరు, రాజులు లేక అధికారులు హరించలేరు. సంపదలాగా భ్రాతలు భాగం అడగలేరు. దీనిని పంచిపెడితే ఎల్లప్పుడు వృద్ధిని పొందుతుంది. అందుకే ఆ విద్యామతల్లి దయవల్ల, దాని విలువ తెలిసిన తల్లిదండ్రులవల్ల ముగ్గురు అన్నదమ్ములం ఈరోజు బాగున్నాం. ముగ్గురం IAS, IPS, IIT, IIM లు కాకపోయినా, వారి కాలిమీద వారు నిలబడగలిగే చదువులు, నా తమ్ముల్లో ఒకడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో DIP In Photography చేసి దూరదర్శన్‌లో కెమెరామెన్, రెండవవాడు B.E. Computer చదివి అమెరికాలో వుంటున్నాడు. ఇలా ఆయన జీవిత ఆరంభకాలంలోనే నాన్న, అమ్మ మేము ముగ్గురం పిల్లలం కాకుండా మాతో కొంతమంది బంధువులు వుండేవారు, వారే కాకుండా వూరి నుంచి సినిమా వేషాలకొచ్చి ఇంటిలో వుండిపోయే కొంతమంది ఎప్పుడు పదిమందికి తక్కువ కాకుండా వుండేవారు. తన బ్రతుకే ప్రశార్థకంగా వుంటున్న సమయంలో తనతో పాటు ఇంకో నలుగురికి సహాయపడే ఉన్నత వ్యక్తిత్వం.

మొదట పత్రికలలో పనిచెయ్యడం, తరువాత పత్రిక పెట్టడం, తరువాత సినిమాలు అలా జరుగుబాటు అవుతూ వుండేది, కాని కంఫర్ట్‌బుల్ లైఫ్ కాదు. సరిగ్గా చెప్పాలంటే సముద్రపు ఒడ్డున ఇసుకలో ఇల్లు కట్టుకుని, ఆనందించేలోనే ఒక అల కొట్టెయ్యడం, మళ్ళీ ఇల్లు కట్టడం ఇలా విసుగు విరామం లేకుండా నిత్య పోరాటమే. నిరాశ, నిస్పృహ రాలేదు. ఏదో చెయ్యగలం అనే ఆశయం వుండేది. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా మంచితనాన్ని, నిజాయితీని, నీతిని విడవని వ్యక్తిత్వం. భగవంతుడు ఎన్నో పరీక్షలు పెట్టినా ప్రహ్లాదుడిలా నెగ్గుకుంటూనే వచ్చారు.

ఇలా సరిహద్దులో సైనికుడిలా రోజు పోరాటానికి సిద్ధమవుతూ ఇద్దరు పిల్లలకు పెళ్ళిళ్ళు, ఒక మనవరాలు (నా పెద్ద కూతురు) వచ్చేసరికి షష్ఠి పూర్తి వయసొచ్చింది. ముగ్గురు పిల్లలు సంపాదిస్తున్నారు, తరతరాల ఆస్తి లేకపోయినా తన తరం వరకు లోటు లేకుండా వుంది. తెలుగు సంవత్సరాలు అరవై ఒక రౌండ్ వచ్చేసరికి, మళ్ళీ ఆయనకేం బుద్ధి పుట్టిందో మళ్ళీ మొదటినుంచి జీవితం ప్రారంభించారు. అదే షష్ఠి పూర్తి అయ్యి హాయిగా విశ్రాంతి తీసుకోకుండా తన షష్ఠిపూర్తి అయిన మరుసటి ంవత్సరం "ప్రముఖాంధ్ర" పత్రికను ప్రారంభించారు. ఆంధ్రేతర రాష్ట్రంలో వుంటూ ఓ తెలుగు పత్రిక. అప్పటికి ఇక్కడ వున్న తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాదు వెళ్ళిపోయింది, తెలుగువారు తక్కువైపోయారు. తెలుగు పాఠశాలలు తగ్గిపోయాయి. తెలుగు మాట్లాడటం తగ్గిపోయింది. ఇవన్నీ ఆయన మనసులో ఏదో ఒక తెలియని అలజడిని సృష్టించింది. నిజమైన "సీనియర్ సిటిజన్"గా ఆలోచించారు. బాధ్యత తెలిసిన పెద్దవాడిగా ఆ ఆలోచన ప్రభావమే "ప్రముఖాంధ్ర", ఆ పత్రికని తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగువారి గొప్పతనాన్ని తెలియచెప్పడమే ప్రధానంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వానికి కాని, పెద్ద పెద్ద తెలుగు సంస్థలకు కాని రాని ఆలోచన ఆయనకు ఎందుకో? ప్రముఖాంధ్ర ద్వారా భారతదేశంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, ఢిల్లీ, ముంబయి, ఒరిస్సా, కర్ణాటకలో ఎక్కడ తెలుగు సభ జరిగినా

తన గళాన్ని వినిపించేవారు. అలాగే అండమాన్ దీవులకు వెళ్ళారు, సముద్రాలు దాటి సింగపూర్, మలేసియా, అమెరికా, కెనడా, దుబాయిలలో విస్తృతంగా పర్యటించారు. ఒన్‌మాన్ ఆర్మీలా అరవై ఏళ్ళ వయసయ్యాక దేశ విదేశాల్లో తెలుగు భాష గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటారు. 1983 నుండి 2015 వరకు ఎక్కడ తెలుగు సభలు జరిగినా అక్కడకు వెళ్ళేవారు.

ప్రముఖాంధ్ర ఇండియాతో పాటు 12 దేశాలలోని తెలుగు వారి వాకిలిలు తాకి, వారి హృదయాలను మీటుతోంది. ఒక పత్రిక నిర్వహించడం ఎంత కష్టమో విజ్ఞులందరికి తెలుసు. అదీ ఏ వ్యాపార విలువలు లేకుండా, నాణ్యతగా, స్థాయి తగ్గకుండా నడపడం మరెంత కష్టమో కూడా అందరికి తెలుసు. ఆయనకు వైశ్యులంటే వల్లమాలిన అభిమానం. ఆయన వైశ్యమిత్రులు ఆయన మంచితనానికి, ఆయన నిజాయితీకి, ఆయన తెలుగు భాషకు చేస్తున్న సేవకు వారు ఒక చేయూతనిస్తూ ఆ పత్రికకు కొన్ని ప్రకటనలిస్తూ వున్నారు. అయినా ప్రతి నెలా కనీసం 15,000 నుండి 20,000 రూపాయలు లోటు వున్న ఏదో అలా నెట్టుకుంటూ వస్తున్నారు.

ఇప్పుడాయన వయస్సు 83, మేమందరం దేవతగా భావించే మా అమ్మ సత్యవతి మమ్మల్ని విడిచి వెళ్ళి దరిదాపుగా 13 ఏళ్ళు అంటే ఆయన డెబ్బైయవ ఏట నుండి ఆయన వెంట అమ్మ లేదు. దానితో సగం దెబ్బ తరువాత, హార్ట్ ఆపరేషన్, 2014లో మాత్రం రెండుసార్లు హాస్పిటల్ ఒకసారైతే సీరియస్ అయ్యి వెంటిలేటర్స్ వరకూ వెళ్ళి తిరిగివచ్చారు. అమెరికానుంచి తమ్ముడు, సరదాగా అమెరికా చూద్దామని వెళ్ళిన మా మేనమామ శ్రీరామచంద్రమూర్తి ఆరువారాలుండాలని వెళ్ళి ఈ వార్త విని రెండు వారాల్లోనే తిరిగి వచ్చేశారు. పేరుకి మావయ్య అయినా మా ఇంటికి పెద్దకొడుకులాంటివాడు. మంచి, చెడులకు ముందుంటాడు. ఈ ఇంటిలో పెరిగిన బిడ్డ. ఇన్ని అవాంతరాలు ఎదురయినా, ఈ సంచికతో 243 మాసాలు 243 సంచికలు 21 సంవత్సరాలు క్రమం తప్పకుండా ప్రతి నెలా ప్రముఖాంధ్ర వస్తూనే వుంది. అమ్మ పోయినప్పుడు, ఆయన హాస్పిటల్‌లో వున్నప్పుడు పత్రికకు మేటర్ రాస్తూనే వున్నారు. నాది చివరి పేజి మాత్రమే, మిగిలివన్నీ ఆయనే. ఈ పత్రికకు మంది మార్బలం ఆయనా, నేనే, మేమే బాస్, మేమే బాయ్.

అంతా బాగానే వుంది నాన్నగారితో నేను అన్నానే ఆ సంగతేమిటి అని అడుగుతున్నారు కదా, ఇదిగో వచ్చేస్తున్నా ఆ విషయానికి – నాకు ఆయన తప్ప వేరే ప్రపంచం తెలియదు కళ్ళు తెరిచిన పసిబిడ్డకు తల్లి ఒక్కొక్క విషయం ఎలా చెపుతుందో, నాకు అలాగే అన్నీ ఆయనే. ఆయన కొన్ని వ్యాపారాల్లో నావల్ల నష్టమొచ్చినా, నన్నెప్పుడు మాట అనలేదు. ఒకే, వాట్ నెక్స్ట్ అంటూ ముందుకెళ్ళాం. నా చదువు అయిపోయిన వెంటనే నేను ఆయనతో వుండిపోయి ప్రారంభించిన ప్రెస్‌ను మెల్లి మెల్లిగా వృద్ధి చేసా. మధ్యలో సినిమాలు ఎంతో ఆశగా వెళ్ళి చతికిలబడ్డాం. అయినా చెక్కుచెదరకుండా మొదటి నుంచి ప్రారంభించాం. నే పెరిగిన వాతావరణం ఇంటినిండా బంధువులు, సంవత్సరానికోసారి బాబాలు, స్వామిజీలు ఇంటికి రావడం, సత్సంగ్‌లు, అలా వుండేది ఆయన నీడను నేను. ఆయన దగ్గర నుంచి నూరు శాతం నేర్చుకోకపోయినా, పాస్‌మార్కులు సంపాదించాను. ఆయన పేరు నేను పెంచకపోయినా పేరుకు రిపేరు మాత్రం తీసుకురాలేదు. ఆయనంత విద్వత్ పాండిత్యం లేకపోయినా నలుగురు మెచ్చే రాత రాయడం నేర్చుకున్నాను. ఎక్కడ మళ్ళీ ఆయన దగ్గరే, ఎలా? ప్రముఖాంధ్ర చదివి. It is not what you leave for your children, it is what you leave in your children, which is important. Leave in them values. ఆయన నాకిచ్చిన విలువలను కాపాడుకుంటూ వస్తున్నాను. ఎలా జీవించాలో చెప్పడం కాదు, ప్రాక్టికల్‌గా ఆయన జీవించి చూపారు, అది పట్టుకుని ఆయన కూడా వుండిపోయాను. ఆయన సహస్ర చంద్ర దర్శనం ఆగష్టు 2, 2015 ఘనంగా చేద్దామని అన్నదమ్ములం ముగ్గురం నిర్ణయించుకున్నాం. తప్పకుండా అందరూ రావాలి. అది మనందరం తెలుగు పండుగలా జరుపుకోవాలి. ఎంతో రాయాలి అనుకున్నా కంప్యూటర్ హార్డ్ డిస్క్ క్రాష్ అయినట్టు, హార్ట్‌లో చాలా భావాలు క్లాష్ అయ్యాయి. వీలున్నప్పుడల్లా పంచుకుంటా. ●

## తితిదేకు రూ. 10 లక్షలు అందజేత



తితిదే ఈవో సాంబశివరావుకు రూ. 10 లక్షల చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

త్యాగరాయనగర్‌లోని **దక్షిణ ఇండియా ఆర్యవైశ్య శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ధర్మపరిపాలన సంస్థ** 27వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. తిరుమల రింగ్ రోడ్‌లోని గుబ్బా సత్రం వేదిక. గురువారం గణపతి పూజ, కలశ స్థాపనతో కార్యక్రమానికి నాంది పలికారు. శుక్రవారం నవగ్రహ హోమం, వాస్తు హోమం, శ్రీసుదర్శన హోమాలు నిర్వహించారు. కోశాధికారి సీహెచ్ రామ్మూర్తి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... వ్యవస్థాపకులు భక్తశిఖామణి ఆర్.ఆర్.నాథం ఆశయాలను ఆచరణలో పెడుతున్న జీవన్‌కుమార్ సేవానిరతిని కొనియాడారు. పూర్ణాహుతి అనంతరం శ్రీసత్యనారాయణస్వామి పూజ నిర్వహించారు. సంస్థ తరపున తిరుమల తిరుపతి దేవస్థానం వారి అన్నదాన పథకానికి రూ. 10 లక్షల విరాళాన్ని కార్యనిర్వహణాధికారి డాక్టర్ దొండపాటి సాంబశివరావుకు సంస్థ ఛైర్మన్ కె.రాంప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జీవన్‌కుమార్, ట్రస్టీలు జి.మురళీమోహన్. ఆర్.అశ్విన్‌కుమార్‌లు అందించారు. ●

## తాండ్ర అశ్విని శాస్త్రి, రోహిణి శాస్త్రిల షష్ట్యబ్ది పూర్తి



**మా**కు అత్యంత ఆప్తులు చెన్నైలో ప్రముఖ వేద పండితులు తాండ్ర అశ్విని శాస్త్రి, రోహిణిశాస్త్రిల షష్ట్యబ్దిపూర్తి తమిళనాడులోని తిరుకడయూరులో జరిగింది. చెన్నైలో వారిని తెలియనివారుండరు. రాజకీయ ప్రముఖులు, సినిమా ప్రముఖులు, వ్యాపార ప్రముఖులు వారందరి ఇళ్ళలోను వీరే పౌరోహిత్యం వహిస్తారు. హస్తవాసి మంచిది. వారి తండ్రిగారు తాండ్ర సుబ్రహ్మణ్యశాస్త్రి గారి నుండి వారి కుటుంబానికి, మా కుటుంబానికి అనుబంధ బాంధవ్యాలు వున్నాయి. మా ఇంటిలో ఏ కార్యక్రమం తలపెట్టిన వారే ముందుండి జరిపిస్తారు. నా పెళ్ళి వారే చేయించారు, మా అమ్మాయి పెళ్ళి వారే చేయించారు. వారిద్దరిని రామలక్ష్మణులు, బలరామకృష్ణులు అనవచ్చు. అంతటి అన్యోన్యత. వారి అరవై ఒకటవ పుట్టినరోజు ప్రసిద్ధ శైవక్షేత్రమైన తిరుకడయూరులో జరిగింది. ఆ క్షేత్రం షష్టబ్ద పూర్తి (60), భీమరథశాంతి (70), శతాభిషేకం (80) సంవత్సరాల వారికి చాలా విశేషమైనది. దేవతలు క్షీరసాగర మథనంలో అమృత భాండం వచ్చి నప్పుడు విఘ్నేశ్వరుడికి ప్రార్థన చెయ్యలేదు. కోపం వచ్చిన గణేశుడు ఆ అమృత భాండాన్ని తీసుకొని తిరుకడయూరులో దాచాడట. ఆ అమృతం లింగాకారం అయ్యింది. అందుకే ఆ శివుడి పేరు అమృతకడేశ్వర్ (అమృతం + కడం అంటే బిందె). అలాగే ఈ క్షేత్రంలోనే మార్కండేయుడికి చిరంజీవి వరమిచ్చిన స్థలం కూడా. ఇక్కడి అమ్మవారి పేరు అభిరామి. బట్టరు గారు "అభిరామి అందాది" అనే శ్లోకాలను రచించారు. దానితో ఆయన అభిరామి బట్టర్ అయ్యారు. అప్పర్, సుందర్, తిరుజ్ఞాన సంబంధర్ అనే కవులు ఈ క్షేత్ర మహత్యాన్ని గురించి ఎన్నో పాటలు రాశారు. అందుకని ఆయుష్య హోమం, షష్ఠి పూర్తి, భీమరథ శాంతి, శతాభిషేకం ఈ క్షేత్రంలో జరుపడం అత్యంత విశేషం. అటువంటి పుణ్యక్షేత్రంలో ఈ అన్నదమ్ములిరువురి షష్ఠిపూర్తి వారి బంధుమిత్రుల సమక్షంలో కడు గొప్పగా జరగడం ఆనందదాయకం. వారు వారి కుటుంబ సభ్యులు ఎప్పుడు సుఖసంతోషాలతో వుండాలని ఆ సర్వేశ్వరుడిని ప్రార్థిస్తున్నాను.